# వృద్ధి ఫలం పొందాలంటే..

పొదుపా..? నాకసలు ఆ పదమే తెలియదు.

అబ్బా... ఇప్పుడేగా ఉద్యోగంలో చేరింది. ఇంకా వీటి గురించి మాట్లాడటానికి చాలా సమయం ఉంది.

ఇంటిని నెట్టుకురావడానికి ఇప్పుడు వచ్చేది సరిపోవటం లేదు... ఇంకెక్కడ పొదుపు చేసేది..

నేను చివరి క్షణం వరకు పనిచేస్తాను.. కాబట్టి హ్యాపీగా ఎంజాయ్ చేయక పొదుపెందుకంటారు? ఇది శంకర్ అభిప్రాయం.

అరే... ఆలస్యమైపోయిందే ఓ పదిసంవత్సరాల ముందు నుంచే పొదుపు ప్రారంభిస్తే ఎంత బాగుండేదో కదా?.. ఇది రిటైర్మెంట్‌కు దగ్గరపడ్డ శ్రీనివాస్ ఆవేదన!

"పొదుపు" అన్న పదం వినపడగానే పై వాటిలోంచి ఏదో ఒక ప్రశ్న మొదలవుతుంది మనకు. జీవితంలో విద్య, వినయం వంటివి చిన్న తనం నుంచి ఎలా నేర్చుకున్నామో... పొదుపు గురించి కూడా అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పకతప్పదు. మారుతున్న జీవన ప్రమాణాలు, పెరుగుతున్న వ్యయాలు, అనుకోకుండా వచ్చే ఖర్చులు... ఇలాంటి అనేక సమస్యలకు సమాధానం చెప్పే ఏకైక మార్గం 'పొదుపు'. వీటిని చేరుకోవడానికి అనేక ఇన్వెస్ట్‌మెంట్ మార్గాలున్నాయి. వీటిలో పోస్టాఫీసు పథకాలు, బ్యాంకు డిపాజిట్లు, నేషనల్ సేవింగ్ సర్టిఫికెట్స్, బీమా, ఫండ్స్, షేర్లు ,బంగారం ఇలా అనేకం ఉన్నాయి. మరి వీటిలో ఎందులో ఇన్వెస్ట్ చేస్తే బాగుంటుందన్న విషయానికి వస్తే దీనికి అనేక అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి. ముందుగా పరిశీలించాల్సింది మీ ఆర్థిక స్థితిగతులు, ఆదాయ వ్యయాలు, ఆర్థిక లక్ష్య కాలపరిమితి, రిస్క్ సామర్థ్యం వంటి విషయాలను పరిగణనలోకి తీసుకోవాలి. వీటితో పాటు పరిశీలించాల్సిన మరో విషయం కూడా ఉంది...దేశ ఆర్థిక వ్యవస్థ వృద్ధిరేటు.

మన దేశ ఆర్థిక వ్యవస్థ వృద్ధిరేటు వేగంగా పెరుగుతోంది. దీనికి అనుగుణంగా మనం పెట్టుబడి నిర్ణయాలను తీసుకుంటే ఆ ఫలాలను పూర్తిస్థాయిలో మీరు పొందవచ్చు. 1990లో మొదలైన ఆర్థిక సంస్కరణలను అధికారం చేపట్టిన అన్ని ప్రభుత్వాలు విజయవంతంగా ముందుకు తీసుకువెళుతున్నాయి. వచ్చే 5, 10 ఏళ్ళలో ఈ వృద్ధి మరింత పెరిగే సంకేతాలు కనిపిస్తున్నాయి. కార్పొరేట్ సంస్థలు ప్రకటిస్తున్న ఫలితాలు, వేగంగా విస్తరిస్తున్న మౌలికసేవా రంగాలు, ఈక్విటీల్లోకి వస్తున్న ఎఫ్ఐఐ పెట్టుబడులు, జనాభాలో



వేణు గోపాల్ జాగర్లమూడి

సర్టిఫైడ్ ఫైనాన్షియల్ ప్లానర్, జెనసిస



అధిక శాతం యువత ఉండటం వంటి అనేక అంశాలు ఈ ఆశలను మరింత పెంచుతున్నాయి. ఇదే విధమైన వృద్ధిరేటును కొనసాగిస్తే వచ్చే ఒకటి రెండు దశాబ్దాల్లో మనం కూడా అగ్రశ్రేణి దేశంగా ఎదుగుతామనడంలో ఎటువంటి సందేహం లేదు. మరి ఈ వృద్ధి రేటు నుంచి మీరు ప్రతిఫలం పొందాలంటే మాత్రం కొద్దిగా రిస్క్ చేయక తప్పదు. ఒక దేశ వృద్ధిరేటు ముందుగా కనిపించేది వివిధ రంగాలకు చెందిన కంపెనీల్లో... కాబట్టి ఆయా కంపెనీల షేర్లలో ప్రత్యక్షంగా లేక పరోక్షంగా ఇన్వెస్ట్ చేసి దీర్ఘకాలం వేచి చూడటం ద్వారా ఈ ప్రతిఫలాలను పొందవచ్చు. గడచిన 25 సంవత్సరాల్లో సెన్సెక్స్ సగటున 16-19% రాబడినిచ్చింది. సెన్సెక్స్ ఇలా కొత్త శిఖరాలను అధిరోహిస్తూ పోతున్నప్పుడు ఒక పెట్టుబడిదారునిగా మిగిలిన మొత్తాలను భద్రతో కూడిన ఇతర పథకాలకు కొంత కేటాయిస్తూ ఈక్విటీ ఫండ్స్, గోల్డ్, స్థిరాస్తిలాంటి వాటిలోకి మిగతా మొత్తాన్ని కేటాయించుకోండి. ఆర్థిక వ్యవస్థ వృద్ధిరేటుకు బారోమీటరుగా పరిగణించే క్యాపిటల్ మార్కెట్ మార్గంలో ప్రయాణించడం ద్వారా మరింత లాభాలను పొందండి.